


భారతీయ విజ్ఞాన సమ్మేళనం ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, క్యాంపస్: 'సమగ్ర వికాసానికి భారతీయ చింతన' అనే భావంతో డిసెంబర్ 26 నుంచి 29 వరకూ నాలుగు రోజుల పాటు దేశంలోని 32 రాష్ట్రాల నుంచి, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వచ్చే 1250 మంది ప్రతినిధులతో భారతీయ విజ్ఞాన సమ్మేళనం వైభవంగా ప్రారంభమయ్యింది. అంగరంగ వైభవంగా శుక్రవారం జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలోని ప్రాంగణంలో ప్రారంభించారు. భారతీయ విజ్ఞాన సమ్మేళనం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్ సంఘచాలక్ మోహన్‌జీ భగవత్, గౌరవ అతిథులుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్, నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డు సభ్యులు, డిఆర్‌డిఒ పూర్వ ఛైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి, సిఎస్‌ఐఆర్ పూర్వ డైరెక్టర్ జనరల్, విజ్ఞాన భారతి జాతీయ అధ్యక్షులు డాక్టర్ శేఖర్ మాండే, జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య జిఎస్‌ఆర్ కృష్ణమూర్తి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. డాక్టర్ సతీష్‌రెడ్డి అతిథులకు స్వాగతోపన్యాసం చేశారు. సిఎస్‌ఐఆర్ పూర్వ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శేఖర్‌మాండే విజ్ఞాన భారతి గొప్పతనాన్ని, లక్ష్యాలను, చేస్తున్న కార్యకలాపాలను, నాలుగు రోజుల భారతీయ విజ్ఞాన సమ్మేళనం ఉద్దేశ్యాన్ని వివరించారు. కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ ఈ విజ్ఞాన సమ్మేళనం జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో నిర్వహించడం గౌరవమని తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగంలో భారతదేశం ప్రగతిపథంలో ముందుకు దూసుకెళ్తోందని వివరించారు. భారతదేశ ఆయుధాలను ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థితి ఏర్పడిందని, కరోనా సమయంలో భారతదేశీయ వ్యాక్సిన్లు ప్రపంచానికి అందించిన ఘనత మనకుందని వివరించారు. పరిశోధన రంగంలో భారతీయులు ముందంజలో ఉన్నారని, ప్రస్తుతం భారతదేశ శాస్త్రసాంకేతిక రంగంలో 35వ స్థానంలో ఉందని, 100 పరిశోధన పత్రికలలో 20 మనదేశం నుండే వెలువడుతున్నాయని, చైనా, అమెరికా తర్వాత 3వ స్థానంలో భారతదేశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ శాస్త్రసాంకేతిక జ్ఞానాన్ని తెలుసుకోవాలని, అందుకోసం సైన్స్ అండ్ టెక్నాలజీ గ్రంథాలను భారతీయ ప్రాంతీయ భాషలలో అనువాదం చేస్తున్నామని చెప్పారు. మన భారతీయ జ్ఞానపరంపరను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఎం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ ప్రాచీన కాలంలోనే భారతదేశం విజ్ఞానాన్ని సముపార్జించిన దేశంగా పరిఢవిల్లిందని, ఎన్నో వేల ఏళ్ల క్రితమే అర్బన్ ప్లానింగ్ అంటే ఏమిటో హరప్పా నాగరికత ద్వారా చాటి చెప్పాం అన్నారు. 2900 ఏళ్ల క్రితమే యోగాభ్యాసం చేశామని, ఇప్పుడు 150 దేశాలు యోగాను పాటిస్తున్నాయని, యోగా పాటిస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రధాని మోదీ నేతత్వంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని రికార్డు స్థాయిలో నిర్వహించాం అన్నారు. 2600 ఏళ్ల క్రితమే భారత దేశం ఆయుర్వేదం ద్వారా వైద్య సేవలు అందించిందన్నారు. వివిధ కీలక రంగాల్లో నైపుణ్యం సాధించిన నిపుణులు మన భారత దేశం సొంతం అన్నారు. దక్షిణ భారత దేశంలో ఏడవ భారతీయ విజ్ఞాన్ సమ్మేళనాన్ని తిరుపతిలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. 2047 నాటికి భారత దేశం ప్రపంచంలో నెంబర్-1 స్థానంలో నిలుస్తుందన్నారు. ప్రతి జంట ముగ్గురు పిల్లలను కనాలని మోహన్ భగవత్ చెబుతున్నారని, తానూ అదే చెబుతున్నా అన్నారు. ఇప్పుడు మన జనాభానే ఆస్తిగా మారిందన్నారు. పేద-ధనిక మధ్య అంతరాలు తగ్గే వ్యవస్థను రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వినూత్న ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. త్వరలోనే ఏపీ నుంచి క్వాంటం కంప్యూటర్ ఆపరేట్ చేయబోతున్నామని, టెలికాం సంస్కరణలతో కనెక్టివిటీ పెరిగిందన్నారు. స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, ఎయిరో స్పేస్ సిటీ, ఎలక్ట్రానిక్ సిటీ, మెడ్ టెక్ పార్క్ వంటి వాటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. గూగుల్ పెద్ద ఎత్తున పెట్టుబడులను విశాఖలో పెట్టబోతోందన్నారు. ఈ సందర్భంగా ఇండియాస్ నాలెడ్జ్ సిస్టమ్స్ అనే పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు.



శ్రీధరవర్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చంద్రబాబునాయుడు

ముఖ్య అతిథి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్ సంఘచాలక్ మోహన్ జీ భగవత్ మాట్లాడుతూ భారతీయ దష్టి ధర్మదష్టి అని, ప్రతి ఒక్కరూ సుఖంగా జీవించాలని, వికాసమంటే స్వజీవితం ఆనందంగా ఉండటం కాదని, మనతో ఉన్న ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండాలన్నారు. అందరి వికాసమే వికాసం అని, సర్వేపి సుఖినస్సన్తు అనే భారతీయ చింతన అందరూ ఆనందంగా ఉండాలని సూచిస్తోందని వివరించారు. త్వరలోనే భారతదేశం తన పూర్వవైభవం విశ్వగురుస్థానాన్ని అధిరోహిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జ్ఞాన పిపాసకు వివేకం తోడై, విజ్ఞానం ప్రపంచ శ్రేయస్సు కోసం అనే భావనతో ఉండాలన్నారు. మానవుల మనస్సే సర్వకార్యసిద్ధికి మూలమని, మన సంకల్పం దఢంగా ఉంటే జ్ఞానసముపార్జన అత్యంత సులభమని తెలియజేశారు. ప్రస్తుతం భారతీయ జ్ఞాన పరంపర- ఐ.కె.ఎస్ ద్వారా భారతదేశంలోని 2000 సంవత్సరానికి పూర్వం మన ఋషులు రచించిన అత్యంత నిగూఢమైన శాస్త్ర సాంకేతిక విషయాలను వెలికి తీస్తూ భావిభారతానికి అందిస్తుందని చెప్పారు. ప్రతి వ్యక్తి శారీరిక, మానసిక, ఆధ్యాత్మిక వికాసం పొంది జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలియజేశారు. ఈ బాధ్యత విజ్ఞాన భారతి తన భుజస్కందాలపై వేసుకుని అధ్యాపకుల్లో, పరిశోధకుల్లో మంచి శాస్త్ర సాంకేతిక విషయాలపై సదస్సులు, చర్చాగోష్ఠులు నిర్వహిస్తూ ముందుకు సాగుతుందని తెలియజేశారు. సంస్కృత భాషానిలయమైన సంస్కృత విశ్వవిద్యాలయంలో ఈ సదస్సు నిర్వహించడం అత్యంత హర్షణీయమని అన్నారు.

భారతీయ విజ్ఞాన సమ్మేళనం కన్వీనర్, విజ్ఞాన భారతి జాతీయ కార్యదర్శి కొంపెల్ల సుబ్బరాయ శాస్త్రి వందనసమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, తిరుపతి కమీషనర్, జాయింట్ కలెక్టర్ ఎన్.మౌర్య ఐ.ఐ.టి, ఐజర్, ఐ.ఐ.ఎమ్ డౌరెక్టర్స్, వైస్-చాన్సలర్స్, ప్రొఫెసర్స్, రీసెర్చ్ స్కాలర్స్, పురప్రజలు పాల్గొన్నారు.



ఇండియాస్ నాలెడ్జ్ సిస్టమ్స్ పుస్తకావిష్కరణ సభలో చంద్రబాబు, మోహన్‌జీ భగవత్

సత్యవేడులో డిఎస్‌పి కార్యాలయం ఏర్పాటు చేయండి

సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాలు కలుపుతూ రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, డిఎస్‌పి కార్యాలయాలు సత్యవేడులో ఏర్పాటు చేయాలని ఎంఎల్‌ఎ కోనేటి ఆదిమూలం విజ్ఞప్తి చేశారు. తిరుపతి పర్యటనలో భాగంగానారా చంద్రబాబునాయుడును కలిసి విజ్ఞప్తి చేశారు. కెవిబిపురంలో పేదల కోసం టిటిడి కల్యాణ మండపాన్ని నిర్మించాలన్నారు.

సీఎంకు వినతిపత్రం ఇవ్వడం కూడా నేరమా? :కాంగ్రెస్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇవ్వడం కూడా నేరమా అంటూ కాంగ్రెస్ నాయకులు పోలీసులను ప్రశ్నించారు. తిరుపతిలో శుక్రవారం భారతీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దష్టికి, పలు సమస్యలను వినతిపత్రం ద్వారా తీసుకు వెళ్లడానికి ప్రయత్నించిన తమను పోలీసులు ఏమాత్రం పట్టించుకోకుండా నిర్దాక్షిణ్యంగా అరెస్టు చేసి, అగ్రికల్చరల్ యూనివర్సిటీ బయట వదిలివేయడం అమానుషమని కాంగ్రెస్ పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు అన్నారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి సందర్భంగా స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని రోజుకు 20వేల మందికి దర్శనం కల్పించాలని కోరుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దష్టికి తీసుకు వెళ్లడానికి, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు గౌడుపేరు చిట్టిబాబు, పిసిసి ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులుతో కలిసి వెళ్లే ప్రయత్నం చేయగా బలవంతంగా అరెస్టు చేసి అక్కడ నుంచి తరలించారన్నారు.

సిఎంకు ఘన స్వాగతం, వీడ్కోలు

ఎస్‌వి అగ్రికల్చర్ కాలేజీలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు ఘన స్వాగతం, వీడ్కోలు లభించింది.



వణికిస్తున్న చలి!

- సిబ్బంది కొరత
- పారిశుద్ధ్య కార్మికులకు పనిభారం
- స్పందించని కార్పొరేషన్ అధికారులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఉదయాన్ని నిద్రలేచి నగరంలోని వీధులను ఊడ్చి, మురుగు కాలులను శుభ్రం చేసే కార్మికులకు వణికిస్తున్న చలి ఇబ్బంది పెడుతోంది. ఉదయం ఐదు గంటలకల్లా వీధులను శుభ్రం చేసి సర్వాంగ సుందరంగా తయారు చేస్తున్న పారిశుధ్య కార్మికులు చలికి తట్టుకొనేలా నగర పాలక సంస్థ చేతికి గ్లౌజులు, చలికి తట్టుకొనేలా దుస్తులు ఇవ్వకపోవడంతో సాధారణ దుస్తులతోనే వణికిపోతూ విధులు నిర్వహించాల్సి వస్తోంది. మరో వైపు పారిశుధ్య కార్మికుల కొరత కారణంగా పని భారం పెరుగుతోంది. నగర జనాభాకు తగ్గట్టుగా పారిశుధ్య కార్మికుల నియామకం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు.

చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్స్‌లో ప్రతి 500 వందల మంది జనాభాకు ఒక పారిశుధ్య కార్మికుడిని నియమించాల్సి ఉంది. ఈ ప్రకారం నగర పాలక సంస్థ జనాభా 2,41,917 మంది ఉన్నారు. ప్రస్తుతం నగర పాలక సంస్థలో రెగ్యులర్, ఔట్ సోర్సింగ్ పారిశుధ్య జనాభా ప్రకారం అయితే 487 మంది అవసరం వుండగా 76 మంది కార్మికుల కొరత ఉంది.

మరో వైపు నాన్ హెల్త్ సిబ్బంది కూడా కొరత ఉండటంతో వీధి దీపాలు, నీటి సరఫరా విభాగంలో కూడా సిబ్బంది కొరత భర్తీ చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఈ విధులను 87మంది మాత్రమే నిర్వహిస్తున్నారు. జానాభాకు తగ్గట్లుగా మరికొంత మందిని విధుల్లో తీసుకోవాల్సి వుంది. ఒక్క పారిశుధ్య నిర్వహణ కోసమే జనాభా లెక్కల ప్రకారం 483 స్థానంలో 407 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నా కార్మికుల కొరత కారణంగా విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులపై అదనపు పని భారంతో పడుతోంది. రెగ్యులర్ కార్మికులు 238 మందికి కాను 100 మాత్రమే రెగ్యులర్ పారిశుధ్య కార్మికులున్నారు. కార్మికుల కొరత వణికిస్తున్న చలితో ఉదయాన్నే పారిశుధ్య పనులు చేసేందుకు నగరపాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు నానా తంటాలు పడాల్సి వస్తోంది. ఈ ఏడాది ఆగస్టు నెలలో నిర్వహించిన నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో పారిశుధ్య కార్మికుల కొరత తీర్చేలా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో కార్మికుల నియామకం చేపట్టాలని తీర్మానించినా ఆ మేరకు పారిశుధ్య కార్మికుల నియామకం జాప్యం జరుగుతోందని కార్మిక సంఘాల నేతలు చెబుతున్నారు.

వణికిస్తున్న చలిలో ఉదయాన్నే వీధులన్ని ఊడ్చి, మురికి కాల్వలు శుభ్రం చేసే పారిశుధ్య కార్మికులను అవసరమైన గ్లౌసులు, చలికి తట్టుకొనేలా దుస్తులు, షులు, మంచులో రోడ్లపై విధులు నిర్వహించే కార్మికులు ప్రమాదాలకు గురికాకుండా కనిపించేలా రైమెండ్ స్టికర్స్ కలిగిన యూనిఫాం అందించాల్సిన అవసరం వుంది. స్వచ్ఛ చిత్తూరు క్లీన్ అండ్ గ్రీన్‌లో పారిశుధ్య కార్మికులు అగ్రభాగంలో నిలుస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం విషయంలో నగర పాలక సంస్థ అత్యంత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముంది. ఇటీవల కురిసిన వర్షాలకు వాతావరణంలో ఏర్పడిన మార్పుల ఫలితంగా చలి తీవ్రత పెరిగింది. వ్యాధులు విస్తరిస్తున్నాయి. పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధుల బారిన పడకుండా ఉచిత వైద్యం అందించాలి. చెత్త సేకరణ కోసం అవసరమైన తోపుడు బండ్లు అందించాలి. మరమ్మతుకు గురైనా తోపుడు బండ్లకు మరమ్మతులు చేపట్టాలని పారిశుధ్య కార్మికులు కోరుతున్నారు. ఈ దిశగా నగర పాలక సంస్థ అధికారులు పారిశుధ్య కార్మికుల అవసరాలను గుర్తించి పారిశుధ్య కార్మికుల అవసరాలను గుర్తించి చలి, వంచుకు తట్టకొనేలా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం వుంది. నగర పాలక సంస్థతో పాటు స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు పారిశుధ్య కార్మికులను తోడ్పాటును ఇచ్చి ఆదుకోవాల్సి వుంది.



జంట ఏనుగుల దాడులు!

నరియాలలో హడలిపోతున్న అటవీ ప్రాంత రైతులు

ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని ననియాల గ్రామ పరిసరాల్లో ఉన్న పంటలపై గురువారం రాత్రి జంట ఏనుగులు దాడులు చేశాయి. రాగి, వరి, నూర్పిడి అయిన పైరు, గింజలను తిన్నంత తిని, తొక్కి రైతులకు అపార నష్టం కలిగించాయి. చీకటి పడితే జంట ఏనుగులు ఏదో ఒక అటవీ సరిహద్దు గ్రామ సమీపంలోని పంటలపై పడి విధ్వంసం సృష్టిస్తున్నాయి. అటవీ అధికారులు, ట్రాకర్లు టపాకాయలు, బాణాసంచాలు పేల్చి ఏనుగులను దారి మళ్లించేందుకు విశ్వ ప్రయత్నం చేసిన ఫలితం లేకపోతోంది. అటవీ అధికారులు పంట నష్టాన్ని పరిశీలించి పరిహారం అందిస్తామని రైతులకు తెలిపారు. ముఖ్యంగా అటవీ సరిహద్దు గ్రామాల్లో రాత్రి వేళల్లో పంట పొలాల వైపు వెళ్లాలంటే ప్రజలు, రైతులు హడలిపోతున్నారు. చీకటి పడితే గుంపు నుండి విడిపోయిన ఒంటరి ఏనుగు, మరో జంట ఏనుగులు ఎదో ఓ గ్రామం వైపు వచ్చి పంటలు నాశనం చేస్తున్నాయి. అటవీ సరిహద్దు చుట్టూ అసంపూర్తిగా వదిలేసిన కందకాలు పూర్తిచేసి, సోలార్ పెన్సింగ్ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



వరి ధాన్యాన్ని ధ్వంసం చేసిన ఏనుగులు

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ



ప్రభుత్వ ఆస్పత్రికి తనిఖీ చేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- రామకుప్పం: మండల కేంద్రం రామకుప్పం లోని ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో టాటా డిజిటల్ సర్వే పరిరక్షణను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంజీవని కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేయాలని, త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసే కార్యక్రమానికి ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులు కలెక్టర్‌ను కలిసి హంద్రీ-నీవా జలాలను చెరువులకు ఇవ్వాలని కోరారు. మణింద్రం పాఠశాలలో పురాతమైన వృక్షాలను తొలగించాలని గ్రామస్తులు వినతిపత్రం అందించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ కౌలేష్‌ను కలెక్టర్ ఆదేశించారు. అటవీ పరిసర ప్రాంతంలో చెరువులు, కుంటలు నిండిపోవడంతో ఇసుక కొరత ఏర్పడుతూ అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అటవీ ప్రాంతం నుంచి ఇసుకను తరలించుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఆయనను కోరారు. కుప్పం రేంజర్‌తో చర్చించి అవకాశాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని తహశీల్దారును ఆదేశించారు. ఆయన వెంట జిల్లా డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ గంగాదేవి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సిఐటియు 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయండి..

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): ఈ నెల 31వ తేదీ నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా కార్యదర్శి వరలక్ష్మి పిలుపు నిచ్చారు. గంగవరం మండలంలో మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం సిఐటియు అఖిల భారత మహాసభల పోస్టులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఐటియు అఖిల భారత మహాసభలు ఈ నెల 31 నుండి జనవరి 4వ తేదీ వరకు నిర్వహించే మహాసభలను జయప్రదం చేయాలన్నారు. సిఐటియు ఆలిండియా మహాసభలు ఆంధ్రలో మొదటిసారి జరుగుతున్నాయన్నారు. ఈ మహాసభలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక , ప్రజావ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని, ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం దేశంలోని కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, దేశంలోని కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. జనవరి 4వ తేదీన విశాఖపట్నం మున్సిపల్ గ్రౌండ్‌లో లక్షలాది మంది కార్మికులతో ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, విజయమ్మ పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వరలక్ష్మి

మాదక ద్రవ్యాలకు బానిస కావద్దు

- ఐసీడీఎస్ పీడీ కోటీశ్వరి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: బాలలు మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దని ఐసీడీఎస్ పీడీ కోటీశ్వరి పేర్కొన్నారు. జిల్లా స్థాయి వీర బాల్ దివాస్ వేడుకలు స్థానిక పీవీకే అండ్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ పీడీ కోటీశ్వరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి బాలలు మాదక ద్రవ్యాలకు బానిసలు అవుతున్నారని వాటిని స్కూళ్లలో, సమీపంలో వున్న షాపుల్లో విక్రయిస్తున్నారని వాటిని అదుపు చేయాల్సిన బాధ్యత లైన్ డిపార్టుమెంటుతో పాటు స్టూడెంట్స్ గ్రూపుతో ఒక కమిటీని నిర్వహించుకొని వాటిని నిరోధించాలని సూచించారు. సమాజ విద్రోహశక్తులను విద్యార్థులు అడ్డుకోవాలన్నారు. నిర్మల మిషన్ కోఆర్డినేటర్ మాట్లాడుతూ ప్రధాని సందేశాన్ని గౌరవించి దేశ భవిష్యత్తు మెరుగుపడటానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పివికెఎన్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేంద్ర, డిఇఓ కె రాజేంద్రప్రసాద్, జి నిర్మల డిఎంసి, మోహన్ ఎంఈఓలు, సెంటర్ సిబ్బంది చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

నగరిని తిరుపతి జిల్లాలో కలపాలి

ఆర్‌డీవో కార్యాలయం ఎదుట నిరసన



ప్రజాశక్తి -విజయపురం (నగరి): నగరి, నిండ్ర, విజయపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలని కోరుతూ అఖిలపక్ష పోరాట సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో అనుపమకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పోరాట సాధన సమితి నేతలు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నగరి, నిండ్ర, విజయపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలుపుతామని అప్పటి ప్రతిపక్ష నాయకుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల వాగ్దానం చేశారన్నారు. ఆపై మంత్రుల సబ్ కమిటీ విద్యా వైద్య ఆరోగ్యపరంగా, రవాణ సౌకర్యం పరంగా, మూడు మండలాలను తిరుపతిలో జిల్లాలో కలపాలని ప్రకటించా రన్నారు. ఆ మేరకు తిరుపతి జిల్లాలో మూడు మండలాలను కలపడంలో జాప్యమవుతోందని త్వరగా పూర్తిచేయాలని కోరారు. దీనిపై ఆర్డీవో మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి అధికారుల దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా ఫ్రైడే డ్రైడే పాటించాలి

జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:

ఫ్రైడే డ్రైడేగా తప్పనిసరిగా పాటించాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ సూచించారు. చిత్తూరు అర్బన్ హెల్త్ సెంటర్ మాపాక్షి పరిధిలోని గాజులపల్లిలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే తనిఖీ చేశారు. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలతో కలసి ఇంటి ఇంటి ఫీవర్, దోమల లార్వాలు సర్వే నిర్వహించి లార్వాలను తొలగించారు. తొలగించలేని చోట అబేటుతో పిచికారీ చేయించారు. దోమలు వల్ల మలేరియా, డెంగీ, చికున్ గున్యా, బోదకాలు, మెదడువాపు వ్యాధి, ఎలుకలు వల్ల స్క్రైబ్ టైఫస్ తదితర జ్వరాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, ప్రజలకు అవగాహన కల్పించారు. తరువాత గవర్నమెంట్ స్కూలును సందర్శించి పిల్లలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, సూపరువైజర్ నారాయణ, ఫిమేల్ హెల్త్ అసిస్టెంట్ రాణి, టీచర్ హేమలత , కార్యకర్త సరసమ్మ పాల్గొన్నారు.



ఫుడ్ కోర్టును పరిశీలిస్తున్న కలెక్టర్

కుప్పంలో ఫుడ్ కోర్టును పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం బైపాస్ రోడ్డు లోని పూల మార్కెట్ ఎదుట ఏర్పాటు చేయనున్న ఫుడ్ కోర్టును కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడ పీడీ వికాస్ మర్మత్ శుక్రవారం పరిశీలించారు. బైపాస్ రోడ్డులోని బస్ స్టాప్ వద్దనుండి హిందూ శ్మశాన వాటిక వరకు ఫ్లైఓవర్ బ్రిడ్జ్ కింద దుకాణాల ఏర్పాటుతోపాటు ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించి కలెక్టర్ ఫుడ్ కోర్ట్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి ముందువైపు కంటైనర్ ద్వారా ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయనుండగా ఫుడ్ కోర్ట్ ఎదుట రంగురంగుల పెయింటికి వేయనున్నారు. ఇదే ప్రాంతంలో ప్రజల సౌకర్యం మరుగుదొడ్లను సైతం నిర్మించనున్నారు. ఇప్పటికే ఫుడ్ కోర్టుకు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. టిడిపి కార్యాలయం ఎదుట ప్రారంభమయ్యే ఓవర్ బ్రిడ్జి వద్ద తరచు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో ప్రమాదాల నివారణకు రోడ్డును వెడల్పు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పీకే ఉడా చైర్మన్ డాక్టరు సురేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, విస్తరణ కమిటీ సభ్యుడు మంజునాథ్ పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బందిపై దాడి

కేసు నమోదు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలంలో విధి నిర్వహణలో ఉన్న రెవెన్యూ సిబ్బందిపై దురుసు ప్రవర్తనకు పాల్పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పొలం తగాదాల విషయంలో అసంతృప్తితో మండల రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన ఇద్దరు వ్యక్తులు వీఆర్వో, వీఆర్‌ఏలపై అసభ్య పదజాలంతో దూషించి బెదిరించినట్లు తహశీల్దారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులను విధి నిర్వహణలో అడ్డుకోవడం, బెదిరించడం చట్టరీత్యా నేరమని అధికారులు తెలిపారు. సమస్యలు ఉంటే చట్టపరమైన మార్గాల్లోనే పరిష్కారం కోరాలని, హింస లేదా దౌర్జన్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఘటన అధికారులు, ప్రజలు ఇద్దరికీ గుణపాఠంగా నిలిచింది. ఈ విషయంపై తహశీల్దార్ మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల మధ్య వీఆర్వో ఎస్ రాజేష్, వీఆర్‌ఏ బి వినయ్ కుమార్‌లు విధులు నిర్వహిస్తున్న సమయంలోమిట్టపల్లి బైరెడ్డిపల్లి రెవెన్యూ గ్రామానికి చెందిన డి సంపంగి నాగరాజ్ అలియాస్ డి గిరిలు తమ పొలం తగాదాల విషయంలో న్యాయం జరగలేదని ఆరోపిస్తూ మండల రెవెన్యూ కార్యాలయానికి వచ్చి హంగామా స ృష్టించినట్లు సమాచారం. అసభ్య పదజాలంతో దూషిస్తూ, బెదిరింపులకు పాల్పడినట్లు తహశీల్దార్ ఎంఎస్ ప్రసన్న కుమార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనతో ప్రభుత్వ విధులకు అంతరాయం కలిగిందని తెలిపారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన



ప్రజాశక్తి - ఎస్‌ఆర్‌పురం : బాల్య వివాహాల అనర్థాలపై సిడిపివో ఆధ్వర్యంలో మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. కార్వేటినగరం సిడిపిఓ శోభారాణి స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ బాల్య వివాహంపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంతి , అంగన్‌వాడీ కార్యకర్తలు కోమల, రాధ, దివ్య, అరుణ, కల్పన , విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ తల్లీబిడ్డ మృతి

ప్రజాశక్తి-తవణంపల్లి: రెండు రోజుల క్రితం రోడుడ ప్రమాదంలో గాయపడ్డ తల్లీబిడ్డ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందారు. ఎస్ఐ నాయక్ కథనం మేరకు.. ఈ నెల 25వ తేదీ సాయంత్రం నాలుగు గంటల సమయంలో తిరుప-బెంగళూరు జాతీయ రహదారిపై కే పట్నం బ్రిడ్జి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుందన్నారు. ఈ ప్రమాదంలో ఒక కారు, ఒక లారీ ఢీకొన్నాయి. కారును ఉమేష్ అనే వ్యక్తి అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ లారీని ఓవర్‌టేక్ చేయడానికి ప్రయత్నించగా అదుపు తప్పి లారీ వెనుక భాగాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఉమేష్ భార్య కోమల (40) వారి కుమారుడు వర్ధన్ గౌడ్ (11) తీవ్రంగా గాయపడ్డారు. వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు తెలిపారు. ఈ రోడ్డు ప్రమాదానికి సంబంధించి మృతుల కుటుంబ సభ్యుడైన శరత్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నాయక్ తెలిపారు.



మృతిచెందిన కోమల

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొన్నారు. ప్రజలు అర్జీలు ఇవ్వగా, వారి వద్ద నుండి అర్జీలను ఆయన స్వీకరించి వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సంక్షేమం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణమనాయుడు, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, మండల టిడిపి అధ్యక్షుడు స్వామిదాస్, మండల సొసైటీ చైర్మన్ మోహన్ నాయుడు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కోదండ రెడ్డి, యువ నాయకుడు హరీష్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నియాజ్ అలీ, సింగిల్ విండో డైరెక్టర్ జ్యోతి యాదవ్, చిన్నా, ఎంపీడీవో మనోహర్‌గౌడ్, తహశీల్దారు శ్రీనివాసులు, పిఆర్‌డిఈ ఆనంద్ రెడ్డి, వెలుగు ఏపిఎం ఫరీద్ మస్తాన్, సిడిపిఒ పద్మ సునంద, ఏ ఎస్ డబ్ల్యు ఓ నాగేశ్వరరావు, విద్యుత్ ఏఈలు పాల్గొన్నారు.

పంటల బీమా చేయించుకోవాలి

ప్రజాశక్తి -కార్వేటినగరం: రైతులు పంటల బీమా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి హేమలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ సీజన్‌లో వరి పంటకు బీమా చేసుకునేందుకు ఎకరానికి రూ.84 ప్రీమియం చెల్లించిన వారికి ఏదైనా ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం సంభవిస్తే రూ. 42 వేల బీమా వర్తిస్తుందన్నారు. బీమా నమోదుకు సమీపంలోని మీసేవా కేంద్రానికి వారి ఆధార్, పొలం పాసుబుక్, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలు తీసుకెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది వద్ద పంట వేసినట్టు సర్టిఫికెట్ తప్పనిసరిగా పొందాలని సూచించారు. ఈ సర్టిఫికెట్‌తో సహా రైతుసేవా కేంద్రాల్లో బీమా చేయించు కోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బీమా వర్తింపు చేసుకోవాలన్నారు.

మహాశివరాత్రి పనులకు టెండర్ల ఆహ్వానం

మొగిలి ఆలయ కార్యనిర్వహణ అధికారి మునిరాజా

ప్రజాశక్తి - బంగారుపాలెం: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని మండలంలోని మొగిలిలోని కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు టెండర్లను ఆహ్వానిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి మునిరాజా పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆలయానికి సున్నం వేయడం, విద్యుత్ అలంకరణ, మంగళ వాయిద్యాలు, పందిళ్లు, స్వామి అమ్మవార్ల అలంకరించేందుకు పుష్పాలు టెండర్లకు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి గలవారు టెండర్లు వేయాలని తక్కువ మొత్తంలో వేసిన వారికి పనులు అప్పగిస్తామని తెలిపారు. ఈనెల 31వ తేదీ లోపల టెండర్లు నమోదు చేసి కార్యాలయంలో పని వేళల్లో సమర్పించాలన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు.

ఘనంగా వీర్ బాల్ దివస్



ప్రజాశక్తి- విజయపురం (నగరి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వీర్ బాల్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధైర్యం, దేశ భక్తి, నైతిక విలువలపై విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా సాహెబ్ జాదాల జోరావర్ సింగ్, ఫతే సింగ్ వీరత్వాన్ని, త్యాగాన్ని స్మరించు కుంటూ విద్యార్థుల్లో చైతన్యం కల్పించారు. వీర్ బాల్ చారిత్రక గురించి, దేశ చరిత్రలో బాల వీరులు చూపిన ధైర్యం, త్యాగం నేటి సమాజానికి ఎంతో అవసరం అన్నారు. విద్యార్థులు జాతీయ ఐక్యత, నైతిక విలువలపై గౌరవం పెంచుకోవాలని సూచించారు. అనంతరం క్విజ్, వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్ రాజు, ఎన్‌సిసి ఆఫీసర్ డాక్టర్ భాస్కర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ స్వాతి, అధ్యాపకులు రేవతి, గిరీష్ కుమార్, ఇందిర ప్రియదర్శిని, లాల్ బాషా కుమారి ఎన్‌సిసి కేడెట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం వీరబాల దివస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, దేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన వీరబాలల త్యాగాలను స్మరించారు. ఎంపీడీవో మాట్లాడుతూ, చిన్న వయసులోనే దేశభక్తి, త్యాగబుద్ధి, ధైర్యసాహసాలు ప్రదర్శించిన వీరబాలలు నేటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. వారి త్యాగాలు తరతరాలకూ గుర్తుండిపోయేవని పేర్కొంటూ, విద్యార్థులు చదువుతో పాటు దేశసేవను లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయిని ఎస్. సాహిదాభాను ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వీరబాలలపై ప్రసంగాలు, కవితలు చదవడంతో పాటు దేశభక్తి గీతాలను ఆలపించి సభను ఉత్సాహభరితంగా మార్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వీరబాలలకు ఘన నివాళులు అర్పించారు.

ఆలయ కుంభాభిషేక వేడుకల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జీడీ నెల్లూరు నియోజకవర్గం, పాలసముద్రం మండలం, కమ్మపల్లిలో నూతనంగా నిర్మించిన ఓం శక్తి ఆలయ మహాకుంభాభిషేక ఉత్సవాల్లో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పాల్గొన్నారు. స్థానిక సీనియర్ నాయకులు బి చిట్టిబాబు నాయుడు, స్థానిక నాయకులు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఓం శక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, వాసు నాయుడు, ఇందిరమ్మ, గుండయ్య జి.కుమార్, విజయ్ కుమార్, మోహన్ పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ



ప్రజాశక్తి -బంగారుపాళెం: బంగారుపాళ్యం నుండి గుంతూరు గ్రామానికి వెళ్లే రహదారి మొత్తం రోడ్డు గుంతలు ఏర్పడింది. ఈ విషయాన్ని ఆ గ్రామానికి చెందిన టిడిపి యువ నాయకుడు భావ్యం వంశీ చౌదరి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించడంతో రహదారి పనులు చేపట్టారు. 20 సంవత్సరాలు క్రితం ఈ రోడ్డును వేశారు. అప్పటి నుండి ఈ రహదారి మీదుగా గ్రామీణ ప్రాంత వాసులు వెళుతుంటారు. ప్రస్తుతం ఏర్పడిన గుంతల వల్ల ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని తెలపడంతో స్పందించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ నిధులు మంజూరు చేసి రోడ్డు మరమ్మతు పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

సిఎంను కలిసిన ప్రభుత్వ విప్ థామస్

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: తిరుపతి పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని అలిపిరిలోని ఎయిర్‌పోర్ట్ హెలిప్యాడ్ వద్ద ప్రభుత్వ విప్, గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం.థామస్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

ప్రజా వినతులు, పెండింగ్ కేసులు పరిష్కరించాలి: డిఆర్‌ఓ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: పిజిఆర్‌ఎస్ ఫిర్యాదులు, వివిధ కోర్టులో పెండింగ్‌లో వున్న కేసులు త్వరితగతిన పరిష్క రిం చాలని డిఆర్‌ఓ కే మోహన్ కుమార్ అధికారులను పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్లో ఆయన చాంబర్ నుండి టెలికాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం వినతుల పరిష్కారం, వివిధ కోర్టులకు సంబంధించిన కేసులపై, రిట్ పిటిషన్‌లపై, ఆడిట్ పేరాలపై పలు రెవెన్యూ అంశాలపై జిల్లా అధికారులతో, ఎమ్మార్వోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ పిజిఎస్‌లో వచ్చిన వినుతులను సమగ్ర విచారణ చేసి గడువులలోపు ఫిర్యాదులు పరిష్కరించాలన్నారు. కోర్టు కేసులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ నెల 31వ తేదీ లోపు పరిష్కరించాలని, కంటెంట్ కేసులు 118 ఉన్నాయని తెలిపారు. 42 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, కౌంటర్ కేసులు దాఖలు చేయాలని ఆదేశించారు. వివిధ కోర్టు పిటిషన్లపై దిశ దిశ నిర్దేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు టెలి కాన్ఫరెన్సులో పాల్గొన్నారు.

విద్యుత్ రాయితీని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- పెనుమూరు : రాయితీపై అందించే అదనపు లోడ్డును విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని పెనుమూరు ఏఈ తులసీ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ విద్యుత్ వినియోగ దారులకు 50 శాతం రాయితీతో అదనపు లోడ్డు అందించే అవకాశం ఈ నెల 31వ తేదీ వరకు మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. వినియోదారులు స్వచ్ఛందంగా క్రమబద్ధీకరణ చేసుకున్న వారికి ఈ 50 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు విధిగా గుర్తించాలని ఏఈ తులసీ ప్రసాద్ కోరారు.



రైతులతో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఏఈ

విద్యుత్ సమస్యల పరిష్కారానికి 'జన బాట'

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: గ్రామాల్లో విద్యుత్తు సమస్యలు పరిష్కారానికే జన బాట అని విద్యుత్ శాఖ ఏఈలు వరద రాజులు, తనిగ వేలు అన్నారు. మండలంలోని కోటగరం పంచాయతీ ఎట్టేరి, పాతపాల్యం పంచాయతీ, పాత వెంకటాపురం పంచాయతీలలో శుక్రవారం జనబాట నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈలు మాట్లాడుతూ లూజ్ లైన్లు బాగు చేయటం, ఇంటి లోపల ఉండే మీటర్లను బయట ఏర్పాటు చేయడం, గ్రామాల్లో లైన్లతో చెట్లు కొమ్మలు తగులుతుంటే వాటిని తొలగించడం వంటి పనులు చేయిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎంలు మునిరత్నం, సుమతి, జీవరత్నం, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో ప్రజల వినతులు పరిష్కరించాలి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ప్రజల వినతులు సకాలంలో పరిష్కరించాలని మేయర్ ఎస్ అముద అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'ను శుక్రవారం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇంటి స్థలాలు, హౌసింగ్, పెన్షన్లు, ఉపాధి, భూ సమస్యలపై పలువురు వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మేయర్ సంబంధిత వినతులపై అధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి వినతులు పరిష్కరించాలన్నారు. మొత్తం 24 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎంఈ వెంకటరామి రెడ్డి, గుడిపాల ఎంపీడీవో శిరీష, డిప్యూటీ తహశీల్దారు విజయ్ కృష్ణ, చిత్తూరు రూరల్ ఏవో చంద్రశేఖర్, డీఈలు వెంకటరమణ, శ్రీధర్, టిడిపి నగర అధ్యక్షుడు నరేష్, ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

మహిళల ఆర్థిక బలోపేతమే లక్ష్యం

ప్రజాశక్తి-తవణంపల్లి: మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆధ్వర్యంలో మహిళా సాధికారత కార్యమాన్ని తవణం పల్లి మండల కేంద్రం లోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలకు స్వయం ఉపాధి నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. పరిశ్రమల అభివృద్ధి శాఖకు చెందిన అధికారులు వి రామాంజనేయుల రెడ్డి, బి రామకృష్ణరెడ్డి, వి రమేష్ బాబు హాజరై మహిళలకు ప్రభుత్వం ద్వారా లభించే రుణాలు, రాయితీలు, పథకాలు, మార్కెటింగ్ అవకాశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు నిర్వహ ణాధికారి రవికుమార్, సుబ్బారెడ్డి, ప్రాంతీయ మార్కెట్ అధికారి హేమంత్ కుమార్, తవణంపల్లి మండల సహాయ ప్రాజెక్టు నిర్వహణాధికారి నాగరత్న, సీసీలు, సంఘమిత్రలు, స్వయం సహాయక సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు తమ సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో ముందుకు రావాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగు పర్చుకోవాలని అధికారులు సూచించారు. ఈ తరహా అవగాహన కార్యక్రమాలు మహిళల అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని మహిళలు పేర్కొన్నారు.

నాగ పడగలకు రూ.లక్ష విరాళం



ప్రజాశక్తి -కుప్పం: కుప్పం శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయంలో అమ్మవారికి తొమ్మిది తలల నాగ పడగలు చేసేందుకు గోపీనాథ్ కుటుంబం లక్ష విరాళం అందించింది. సుమారు 27 కేజీలతో నాలుగు అడుగులు వెడల్పు 9 తలల నాగ పడగలు చేసేందుకు ఆలయ కమిటీ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా స్వచ్ఛందంగా భక్తులు పాత వెండితోపాటు విరాళాలు అందజేస్తున్నారు. దీంతో దేవస్థాన చైర్మన్ రవిచంద్రబాబు బావమరిది అశోక్ నారాయణ, భార్య శశికళలు వెండి నాగపడిగల కోసం లక్ష ఒక్క రూపాయి అమ్మవారికి చెల్లించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సోమశాస్త్రి, షణ్ముగం,భాస్కర్, సభ్యులు జయరాం నాయుడు, నరేష్, రాజు, జ్యోతిశ్వర్ పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకం తప్పనిసరి: ఎస్ఐ

ప్రజాశక్తి -కార్వేటినగరం: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడడం బాధ్యతగా తీసుకోవాలని ఎస్ఐ తేజశ్వని శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ హెల్మెట్ లేకపోవడం వల్ల యాక్సిడెంట్లు ఎక్కువగా జరుగుతున్నాయని అందులోనూ ప్రాణాల కోల్పోయిన వాళ్లు చాలామంది ఉన్నారన్నారు. మీపై ఆధారపడి ఉన్న మీ కుటుంబ సభ్యుల గురించి ఆలోచించి హెల్మెట్లు వాడాలని తెలిపారు. కార్వేటినగరంలో హెల్మెట్లు వాడడం చాలా తక్కువగా ఉండేదని తాను ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన తర్వాత హెల్మెట్లు పై అవగాహన కల్పించిన కొద్ది రోజులలోనే హెల్మెట్లు ఎక్కువ సంఖ్యలో వాడడం సంతోషంగా ఉందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కార్వేటినగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వున్నాయని ప్రజలు ఎస్ఐ పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.

శ్రీ విద్యా డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): పలమనేరు పట్టణ సమీపంలోని శ్రీ విద్యా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉదయం యువతీ యువకులకు మెగా జాబ్ మేళాను కరస్పాండెంట్ ఇంటి మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో ప్రముఖ 20 కంపెనీలు ప్రతినిధులు హాజరయ్యారు. ఇందులో యువతీ యువకులు 220 మంది ఉద్యోగాలకు హాజరు కాగా ఇందులో 77 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఇంకా 30 మందిని ఎంపిక చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీ విద్యా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ మాట్లాడుతూ... పలమనేరు పట్టణంలోని శ్రీ విద్యా డిగ్రీ కళాశాల యాజమాన్యం ఎంతో ప్రతిష్టాత్మకంగా తమ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థిని విద్యార్థులకు ఉద్యోగం కల్పించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు. చెన్నై బెంగళూరు హైదరా బాద్ వంటి పెద్ద నగరాలకు వెళ్లకుండా తమ కళాశాల ప్రాంగణంలోనే కంపెనీ ప్రతి నిధులను ఇక్కడికే పిలిపించి జాబ్ మేళాను నిర్వహిస్తున్నా మన్నారు. భవిష్యత్‌లోనూ శ్రీ విద్యా డిగ్రీ కళాశాల యాజమాన్యం వివిధ కంపెనీ ప్రతినిధులతో సంప్రదించి ఉద్యోగాలు పొందేందుకు తమ కళాశాల విద్యార్థిని విద్యార్థులకు ఒక దృఢ సంకల్పంతో ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హర్ష కిరణ్, శివ, లతోపాటు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన శ్రీ విద్యా డిగ్రీ కళాశాల విద్యార్థులు

కురబలు ఐకమత్యంగా ఉండాలి

ప్రజాశక్తి - రొంపిచర్ల: నూతనంగా ఏర్పడనున్న మదనపల్లి జిల్లాలోని నియోజకవర్గాల స్థాయిలో, మండల స్థాయిలలో కురబలు అందరూ ఐకమత్యంగా కలిసి నూతన కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని కురబ కమిటీ నాయకులు పేర్కొన్నారు. కురబ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆ కమిటీ నాయకులు మాట్లాడుతూ కురబ కులస్తులు అందరూ కలిసి కట్టుగా సంఘం ఏర్పాటు చేసుకొని ఎవరికైనా ఎలాంటి సమస్యలు ఉన్నా అందరూ కలిసి పరిష్కరించుకునేందుకు ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. త్వరలో కురబలు అందరూ సమావేశమై ఏకతాటిపై కలిసికట్టుగా సంఘ నాయకులను ఎన్నుకొని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా మదనపల్లిలో ప్రత్యేకంగా కళ్యాణ మండపం నిర్మాణం కొనసా గుతోం దన్నారు. ప్రతి మండల స్థాయిలో అభివృద్ధి కార్యక్ర మాలు, కురబ సంఘాల తోడ్పాటుకు అందరూ కలిసి రావా లన్నారు. ఈ కార్యక్రమం లో కురబ సంఘ నాయకులు డి రామాంజులు, జీవి శివకుమార్, వై శ్రీరాములు, బి ప్రభు, జనార్దన్ గౌడ్, కృష్ణమూర్తి, రామ్ ప్రకాష్, అమరనాధ, రెడ్డెప్ప, ఆవుల పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కురబ సంఘం నాయకులు

రోడ్డు ఏర్పాటుతో ఘర్షణ

- కక్షతో 8 కొబ్బరి చెట్లు కూల్చారని రైతు ఫిర్యాదు
- కేసు నమోదు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: రోడ్డు ఏర్పాటు విషయమై దౌర్జన్యంతో పట్టా భూమిలో ఏర్పాటు చేశారని, దీనిపై కోర్టులో స్టే తెచ్చుకున్నా రోడ్డు ఏర్పాటు చేశారని, అడ్డుకోవడంతో కక్ష గట్టి ఓ రైతు పొలంలో వున్న కొబ్బరి చెట్లను కూల్చివేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. బాధిత రైతు కథనం మేరకు.. మండలంలోని ముహూర్తంపల్లి రోడ్డు నుండి నాగిరెడ్డిపల్లి గ్రామం వరకు రోడ్డు నిర్మించాలన్న సంకల్పంతో గ్రామస్తులు కొన్ని రోజుల క్రితం ఘర్షణలు పడ్డారు. కానీ కొంతమంది నాయకులు అండతో దౌర్జన్యంగా పట్టా భూములను ఆక్రమించి రోడ్డు నిర్మించారు. ఈ విషయమై కొంతమంది రైతులు హైకోర్టుకు వెళ్లి తమభూమి స్టే తెచ్చుకున్నారు. కానీ దౌర్జన్యంగా రోడ్డు నిర్మించారు. రైతు అడ్డుపడగా ఇరు గ్రూపులూ ఘర్షణ పడ్డాయి. ఇందులో భాగంగా రెవెన్యూ సిబ్బంది కొన్ని రోజులకు ముందే కోర్టులో ఉన్న భూమిని వదిలి మిట్టపల్లి గ్రామం వరకు రోడ్డు నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. కానీ గురువారం రాత్రి రైతు పొలంలో ఉన్న 20 సంవత్సరాలకు పైబడిన 8 టెంకాయ చెట్లు గుర్తు తెలియని ఆకతాయిలు నరికేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు శుక్రవారం విచారణ జరిపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని త్వరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు. దీనిపైన తహశీల్దారు ప్రసన్నకుమార్‌ని విచారణ త్వరగా రోడ్డు నిర్మించేందుకు దారి చూపడం వాస్తవమే కానీ కోర్టు స్టే ఉన్న భూమిని వదిలి సర్వే నిర్వహించి ఇచ్చామని వారు పత్రికా ప్రతినిధులకు తెలిపారు.



కూల్చివేసిన కొబ్బరి చెట్లను పరిశీలిస్తున్న నాయకులు



సంఘటన స్థలం వద్ద పరిశీలిస్తున్న పోలీసులు

క్షేత్రస్థాయిలో పరిశీలించిన నాయకులు

దీనిపైన వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఎం కృష్ణమూర్తి, జిల్లా ఎంపీపీల అధ్యక్షులు, బైరెడ్డిపల్లి మండలం ఎంపీపీ ఎం రెడ్డప్ప క్షేత్రస్థాయిలో పరిశీలించారు . చెట్లు నరి

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి పోలీస్ స్టేషన్లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న రామేగౌడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. పలమనేరు సబ్ డివిజన్ పోలీసులు రూ.2లక్షల ఆర్థిక సాయం అందజేశారు. వి. కోటలో ఈనెల 21న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రామేగౌడ్ తలకు తీవ్ర గాయాల య్యాయి. బెంగళూరులో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న డీఎస్పీ డేగల ప్రభాకర్ శుక్రవారం ఆయన భార్యకు ఆర్థిక సాయం అందించారు.



రాంపల్లిలో 104 వైద్య సేవలు

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం ఆవుల పల్లె పంచాయతీ రాంపల్లి, మల్లేశ్వరపురం గ్రామాలలో పెద్ద ఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బాలాజీ ఆధ్వర్యంలో 104 వైద్య సేవలను ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు గ్రామాలలోనూ 80 మంది రోగులకు బిపి షుగర్ ఇతర వైద్య పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులు మాత్రలు పంపిణీ చేశామని తెలిపారు. రాంపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజలు చలి ఎక్కువగా ఉన్న కారణంగా జలుబు దగ్గు కారణాలతో ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వ వైద్యశాలలో ఎప్పుడూ అందుబాటులో ఉండే వైద్య సిబ్బంది వద్దకు వచ్చి తమకు వచ్చిన జబ్బుకు సంబంధించి వైద్యుల వద్ద చూపించుకొని మందులు , మాత్రలు తీసుకొని వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశ, 104 సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సేవలు అందిస్తున్న 104 సిబ్బంది

ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ

ప్రజాశక్తి- పలమనేరు: ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన పథకం ద్వారా పేదలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్‌లను పంపిణీ చేస్తున్న అవకాశాన్ని లబ్ధిదారుల సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు తహశీల్దారు కార్యాలయంలో పీఎంయూవై ద్వారా పలమనేరు పట్టణ, మండల పరిధిలోని 117 మంది లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా ఉచిత గ్యాస్ సిలిండర్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు మహిళలకు కష్టం కలగకూడదనే ఉద్దేశంతో చంద్రబాబు దీపం పథకాన్ని తీసుకొచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన ద్వారా అందించే గ్యాస్ కనెక్షన్‌ను ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులతో పాటు తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఇన్వనాథన్, మున్సిపల్ కమిషనర్ ఎన్ వి రమణారెడ్డి, బాలాజీ కో-ఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వి బాలాజీ, టిడిపి నాయకులు సుబ్రహ్మణ్యం గౌడు, నాగరాజు రెడ్డి, వెంకట ముని రెడ్డి, పెద్దబ్బ, జగదీష్ నాయుడు, వెంకటరత్నం, సెల్వరాజ్, రామచంద్ర నాయుడు, గిరి,నదీం, శ్రీనివాసులు పాల్గొన్నారు.



రైతు సేవా కేంద్రం సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-చౌడేపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సముదాయంలో శుక్రవారం పుంగనూరు డివిజన్ రైతు సేవా కేంద్రం సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. . ఈ కార్యక్రమంలో పుంగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు సిశివకుమార్ అధ్యక్షత వహించారు. ఈ శిక్షణలో ఏడిఏ మాట్లాడుతూ రబీ 2025-26 సంబంధించి ఈ పంట నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని సాగులో ఉన్న ప్రతి పంట ఈ పంటలో నమోదు కావాలని తెలిపారు. క్రాప్ బుకింగ్ లో నమోదు చేసిన రైతులకు మాత్రమే తదుపరి యూరియా అందిస్తామని పంట వేసిన ప్రతి ఒక్క రైతు ఈ పంటలో నమోదు చేయాలని సూచించారు.ఏపీ ఏ ఐ ఎం ఎస్ యాప్ కనీసం 300 మంది రైతుల మొబైల్లో ఇన్‌స్టాలు చేయించి ఆ యాప్ ద్వారా వ్యవసాయ సమాచారం ఎలా తెలుసుకోవాలో రైతులు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి రైతు సేవా కేంద్రం సిబ్బంది ప్రస్తుత పంటలు సాగు ద ృష్టిలో పెట్టుకొని ఎరువుల అవసరం కనుగొని ఎరువుల కొరత లేకుండా ముందుగానే సూచిక పంపి ఎరువులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ అధికారులు మోహన్ కుమార్, రాధ, జ్యోతమ్మ, సుధాకర్, శ్రావణి, లీలకుమారి, ఏఈఓ లు శివ శంకర్, ఖాదర్ వల్లి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



మహిళలను వ్యాపారవేత్తలు చేయడమే లక్ష్యం: ఎమ్మెల్సీ



ప్రజాశక్తి-కుప్పం: మహిళలను వ్యాపారవేత్తలుగా తయారుచేసి ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రైన్యూర్ కార్యక్రమంలో భాగంగా మన రోవర్ కంపెనీ ఆధ్వర్యంలోరూపొందించిన యాప్ ను ఎమ్మెల్సీ శ్రీకాంత్, పికేయం ఉడా చైర్మన్ డాక్టరు సురేష్ బాబు శుక్రవారం కుప్పంలో ప్రారంభించారు. ఇప్పటికే వ్యాపారం చేస్తున్న వారికి డిజిటల్ ప్లాట్‌ఫారం ద్వారా అందులకు ఆదాయం కల్పించాలన్న లక్ష్యంతో రోవర్ కంపెనీ ఆధ్వర్యంలో గుడిపల్లి మండలానికి చెందిన మహిళలకు కుప్పం కడ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జిఎం రాజు, గుడిపల్లి మండల అధ్యక్షుడు బాబు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బాబు, పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి-సోమల: రైతులు ప్రకృతి వ్యవసాయం సాగును నేర్చుకోవాలని వ్యవసాయ శాఖాధికారులు సూచించారు. సోమల శ్రీ శక్తి భవన్లో శుక్రవారం మహిళలకు ప్రకృతి వ్యవసాయం సాగుపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువులు వాడుతూ వ్యవసాయం చేయడం వల్ల ప్రజలు అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని వాతావరణంలో మార్పులు వస్తున్నాయని పలు విధాల నేలకు కూడా నష్టం కలుగుతుందన్నారు. వీటన్నిటినీ పరిష్కరించేందుకు రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా కార్యాలయం నుండి వచ్చిన అధికారి నాంచారమ్మ, ఎన్ఎఫ్ఏ ట్రైనర్స్ రెడ్డి రాణి, భువనేశ్వరి సూచించారు. మానవాళికి ఆరోగ్యం అందాలంటే ప్రకృతి వ్యవసాయం ఎంతో అవసరమని ప్రతి రైతు బయోడే సోర్సెస్ సెంటర్ల ద్వారా కషాయాలు తీసుకుని పంటలకు వాడాలని ప్రకృతి వ్యవసాయం సార్వత్రిక సూత్రాల గురించి తెలుసుకోవాలని సీడ్ వెల్లిటైజేషన్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శివరత్నమ్మ, ఏ ఈ ఓ మంజుల, సిహెచ్ఓ అమరనాథ్, ఏపీ ఎం శివ, సిసిలు గందోజి, మునిరత్నం, వహీద్ పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న అధికారి

ప్రజాశక్తి -సోమల: మండలం లోని అన్నెమ్మ గారి పల్లి, పేటూరు, పెద్ద ఉప్పరపల్లి, నంజంపేట సచివా లయాలను జిఎస్‌డబ్ల్యూఎస్ ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బంది హాజరును పరిశీలించారు. ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందజేస్తున్న సేవలు ప్రజలకు తెలిపి ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని, పరిసరాల పరిశుభ్రత పాటించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దారును కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి- తవణంపల్లి: మండల తహశీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన మాధవ రాజుని మండల జనసేన నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపి మండల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శులు డి. వెంకటేశ్వర్లు, ఉదయ్ కుమార్ ఎ.ఎస్., సీనియర్ నాయకులు అజిత్ శ్రీరాములు, యువరాజు స్వేరో, పృథ్వి, అనిల్, సోము, సంతోష్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు. మండల ప్రజలకు మెరుగైన పరిపాలన అందించేందుకు తమశీల్దారుగా తనవంతు కృషి చేస్తానని మాధవ రాజు తెలిపారు.



రాజు కాలువ వాకింగ్ ట్రాక్ పనుల పరిశీలన



ప్రజాశక్తి-కుప్పం: కుప్పం పట్టణం రాధాకృష్ణ రోడ్డు నుంచి నేతాజీ రోడ్డు వరకు పార్కు పక్కన 20 అడుగులతో డ్రైనేజీ, వాకింగ్ ట్రాక్ నిర్మించే ప్రాంతాన్ని ఎమ్మెల్సీ శ్రీకాంత్ పరిశీలించారు. ప్రస్తుతం 10 నుంచి 15 అడుగులు ఉన్న రాజు కాలువను 20 అడుగులకు పెంచి కాలువపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం కుప్పం సెంట్రల్ పార్క్ పనులు ప్రారంభమైన నేపథ్యంలో గతంలో పార్కు చుట్టూ ఉన్న కాంపౌండ్ వాల్ ను పడగొట్టి వాస్తు ప్రకారం ప్రహరీ గోడ నిర్మించనున్నారు. దీంతో ఈ ప్రాంతంలో 20 అడుగులతో డ్రైనేజీ కాలువలతో పాటు పట్టణ వాసుల కోసం వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్,మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కమిషనర్ శ్రీనివాసరావు,కౌన్సిలర్లు జిమ్ దాము, జాకీర్, సోమశేఖర్, ఎంఆర్ సురేష్, ఎస్ అన్న కమిటీ సభ్యుడు మంజునాథ్ రెస్కో డైరెక్టర్ శివ, నాయకులు ఆర్ఆర్ రవి, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

స్టేషన్ మేనేజర్‌కు రైల్వే ప్రయాణికుల వినతి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: రైల్వే ప్రయాణికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు తాండవ మూర్తి అధ్యక్షతన చిత్తూరు నగర ప్రజలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరుటు చెన్నైకి డైరెక్ట్ ట్రైన్ ఏర్పాటు, చిత్తూరులో ఆరు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలన్నారు. కాట్పాడి- చిత్తూరు రైలు పాకాల తిరుపతి మీదుగా నడపాలని రైల్వే డబుల్ లైన్ పనులు పూర్తిచేసి వందే భారత్ ట్రైను నడపాలని కోరారు. మహావీర్ వంతెన కొత్తగా నిర్మించాలన్నారు.